సాక్షి ప్రకాశం

మంగళవారం । 17 । జనవరి । 2023



కన్న కొడుకును కడతేర్చిన తండ్రి

చేతికి అందివచ్చిన కొడుకును కన్నతండ్రే దారుణంగా హత్య చేసిన ఘటన చీమకుర్తి మండలం బూసురపల్లిలో జరిగింది.

- 8లో..



పోలీస్‌స్టేషన్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

సీఎస్‌పురం పోలీస్‌స్టేషన్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రికార్డులు దగ్ధమయ్యాయి. - 8లో..

గరిష్టం/కనిష్టం
30 /19

వాతావరణం

పొగమంచు ఎక్కువగా ఉంటుంది. ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి.



తెప్పోత్సవంలో పాల్గొన్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన సతీమణి శచీదేవి, మేయర్ గంగాడ సుజాత, మరంపల్లి దక్షిణామూర్తి తదితరులు



తెప్పపై విహరిస్తున్న స్వామివార్లు



స్వామివార్ల ఊరేగింపులో భక్తజనం..

నేత్ర పర్వం

దేవదేవుల తెప్పోత్సవం

ఒంగోలు: స్థానిక రంగారాయుడు చెరువులో తెప్పోత్సవం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. కొండమీద వేంచేసిన ప్రసన్న చెన్నకేశవస్వామి, కాశీ విశ్వేశ్వర స్వామి వార్లు సీతారామపురం, గద్దలగుంట పారువేట మీదుగా రంగారాయుడు చెరువుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వేద మంతోచ్ఛరణల మధ్య స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలకు హారతి ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన సతీమణి శచీదేవి, మనుమడు సిద్దాన్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మేయర్ గంగాడ సుజాత పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. గాంధీపార్కులో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

న్యూస్‌రీల్

విద్యతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి మన్మథరావు

సింగరాయకొండ: విద్యతో మాత్రమే అభివృద్ధి సాధించవచ్చని హైకోర్టు న్యాయమూర్తి కె మన్మథరావు అన్నారు. మండలంలోని బింగిన పల్లిలో సోమవారం గ్రామ అభ్యుదయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ శక్తి మేరకు విద్యను అభ్యసించాలని హితవు పలికారు. నేటి సమాజంలో సెల్‌ఫోన్‌కు ఇచ్చే ప్రాధాన్యత తల్లిదండ్రులకూ ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం సెల్ ఫోన్‌తో కలిగే అనర్థాలను ఆయన వివరించారు. ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జెట్టి విజయలక్ష్మి, డాక్టర్ నూకసాని సుబ్బారావు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం



అగ్నిప్రమాదంలో కాలిపోయిన ఇల్లు

పుల్లలచెరువు: మండలంలోని చాపలమడుగు గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సోమవారం అగ్ని ప్రమాదం జరగడంతో చల్ల గుండ్ల వెంకటయ్య అనే వ్యక్తి ఇల్లు పూర్తిగా కాలిబూడిదైంది. ఈ సందర్భంగా ఇంటిలోని వస్తువులతో పాటు మొత్తం సుమారు రూ.2 లక్షల నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు.

హోరా హోరీగా చెడుగుడు పోటీలు



పోటీలో తలపడుతున్న ఇరు జట్లు

నాగులుప్పలపాడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అమ్మనబ్రోలులో జరుగుతున్న తెలుగు రాష్ట్రాల స్థాయి చెడుగుడు పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. సోమవారం ప్రారంభమైన పోటీల్లో తొలి మ్యాచ్‌గా నెల్లూరు, ప్రకాశం జట్లు తలపడ్డాయి. సోమవారం జరిగిన మ్యాచ్‌లలో గుంటూరు జట్టు 3 మ్యాచ్‌లు ఆడి ఒకటి గెలిచింది. నెల్లూరు ఒక మ్యాచ్ ఆడి గెలిచింది. పశ్చిమ గోదావరి జట్టు రెండు మ్యాచ్‌లు ఆడి గెలిచింది. చీరాల రెండు మ్యాచ్‌లు ఆడి ఓడిపోయింది. ప్రకాశం జట్టు రెండు మ్యాచ్‌లు ఆడి రెండింటిలో గెలిచింది. తూర్పు గోదావరి, అడివీధి పాలెం జట్లు తలా ఒక మ్యాచ్ ఆడి ఓడిపోయాయి. ఈ పోటీలను చూసేందుకు పెద్ద ఎత్తున క్రీడాభిమానులు వచ్చారు.

మూడు రోజులు మురిపించి..

ప్రతి ఇంటా పిండి వంటల ఘుమ ఘుమలు. వాకిళ్లలో పరుచుకున్న రంగవల్లుల సరాగాలు.. పార్వేట ఉత్సవాలతో ఉట్టిపడిన ఆధ్యాత్మిక సౌరభాలు.. కుటుంబ పెద్దలను స్మరించుకుంటూ భక్తి శ్రద్ధలతో పెద్దల పండుగ.. పశు పూజలతో రైతులోగిళ్లలో సంబరాలు.. ఊరూవాడా ఎడ్ల పందేల జోరు.. ముగ్గుల పోటీలు, కళా సాంస్కృతిక ఉత్సవాలు..చిన్నా, పెద్దల ఆటపాటలతో సరదాల సందడి.. చదువు, ఉద్యోగరీత్యా పట్టణాలు, నగరాలకు వెళ్లిన వారు స్వగ్రామాలకు తరలిరావడంతో పల్లెల్లో నూతనోత్సాహం నెలకొంది. మూడు రోజులు జిల్లాలో ఎటు చూసినా తొలి పండుగ సంక్రాంతి కాంతులు కనిపించాయి.

- భక్తి శ్రద్ధలతో పెద్ద పండుగ..
- జిల్లాలో వేడుకగా సంక్రాంతి
- రైతులోగిళ్లలో ఆనందాల హరివిల్లు
- ఉత్సాహంగా ఎడ్ల, పొట్టేళ్ల పందేలు
- కోనేరులు, చెరువులు, దొరువుల్లో భక్తిశ్రద్ధలతో పార్వేట ఉత్సవాలు



దొనకొండలో ముగ్గులు వేస్తున్న మహిళలు

ఒంగోలు సబర్బన్: జిల్లాలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. పెద్ద పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామ సీమల్లో సంప్రదాయాలు ఉట్టిపడేలా సంక్రాంతి, కనుమ పండుగలు వేడుకగా జరిగాయి. ఆలయాల్లో భక్తి శ్రద్ధలతో గోదాదేవి కల్యాణాలు నిర్వహించారు. యువత సంప్రదాయ దుస్తుల్లో సందడి చేసింది. నోరూరించే పసందైన వంటకాల నడుమ సంక్రాంతిని ఆనందోత్సాహాల నడుమ నిర్వహించారు. కనుమ పండుగ సందర్భంగా సోమవారం రథం ముగ్గులతో వాకిళ్లను తీర్చిదిద్దారు. సంప్రదాయబద్ధంగా కోడి పందేలు, ఎడ్ల బండలాగుడు పోటీలు, గిద్దలూరు మండలంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పొట్టేళ్ల పందేలు నిర్వహించారు. ఈ పండుగను రైతు కుటుంబాలు, రైతు కూలీ కుటుంబాలతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన వారు ఉల్లాసంగా నిర్వహించుకున్నారు.

ధాన్యం డబ్బు రైతుల ఖాతాల్లో జమ...

జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ రంగ సంస్థలు ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి నేరుగా కొనుగోళ్లు చేశాయి. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని 19 వేల టన్నులు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులను ప్రభుత్వం నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేసింది.

సంక్రాంతి పండుగను వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ఒంగోలులోని తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకున్నారు. కనుమ పండుగను పురస్కరించుకొని కొత్తపట్నం మండలంలోని పాదర్తిలో నిర్వహించిన ఎడ్ల బండ లాగుడు పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం రంగారాయుడు చెరువులో ప్రసన్న చెన్నకేశవ స్వామి, కాశీ విశ్వేశ్వర స్వామిల తెప్పోత్సవంలో బాలినేని కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

అదేవిధంగా బాలినేని గద్దలగుంటలో నిర్వహించిన పార్వేట ఉత్సవంలో కూడా కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. పలు ఆలయాలను సందర్శించిన బాలినేని ఆ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ నాయకులు, టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి ఒంగోలులోని తన నివాసంలో సంక్రాంతి పండుగను తన కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా నిర్వహించుకున్నారు.



భైరవకోనలో భక్తుల రద్దీ



బేస్తవారిపేట: పందిళ్లపల్లెలో మహిళల కోలాటం



ఎడ్ల బండలాగుడు పందెంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

కోలాహలంగా ఎడ్ల పోటీలు

- పాదర్తిలో రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభించిన బాలినేని
- భారీగా తరలి వచ్చిన జనం

కొత్తపట్నం: ఆనందం పొందడానికే ఎడ్ల పోటీలు నిర్వహిస్తున్నారని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆంధ్రా, తెలంగాణ రాష్ట్ర స్థాయి న్యూకేటగిరీ ఎద్దుల బండలాగుడు పోటీలను ఆయన సోమవారం ప్రారంభించారు. తొలుత పాదర్తి గ్రామంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి ర్యాలీగా ఎడ్ల పోటీల ప్రాంగణానికి చేరుకున్నారు. అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం పార్టీ నాయకులు క్రేన్ సహాయంతో గజమాలవేసి బాలినేనిని సత్కరించారు. అనంతరం బాలినేని ఎడ్ల పోటీలను ప్రారంభించారు. కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆళ్ల రవీంద్రరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుదూర ప్రాంతాలకు ఉద్యోగాలు, చదువుల నిమిత్తం వెళ్లిన వారు సంక్రాంతికి ఇళ్లకొచ్చి సంతోషంగా గడపటానికి ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. ఒంగోలు నగరంలో భారీ ఎత్తున జాతీయ స్థాయిలో ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహించాలని నాయకులను సూచించారు. త్వరలోనే పెడతామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లిఖార్జునరెడ్డి, కాంట్రాక్టర్ పిచ్చిరెడ్డి, జెడ్పీటీ సభ్యురాలు సైకం లక్ష్మీశారద, సర్పంచ్ కట్టా సౌందర్య, ఎంపీటీసీ సభ్యురాలు గుడి అరుణ, ఏపీటీసీఏ ప్రెసిడెంట్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ శ్రీనివాసరావు, మూగ వెంకటేశ్వర్లు, మూగ బాలాజీ, చెరుకూరి వీరరాఘవరావు, యలగాల ఆదినారాయణ, పోలేటి ఆంజనేయులు, జజ్జర ఆదినారాయణ, పాకల చిరంజీవి, కట్టా చంద్రశేఖర్, పంత్రంగం బ్రహ్మయ్య, మాజీ ఎంపీపీ బలగాని శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



బాలినేని శ్రీనివాసరెడ్డికి గజమాలతో సన్మానం



పోటీల్లో బండలాగుతున్న ఎడ్లు, వీక్షిస్తున్న ప్రజలు

కలెక్టర్ ఇంట సంక్రాంతి సందడి

- హాజరైన ప్రకాశం, బాపట్ల కలెక్టర్లు, ఎస్పీలు

ఒంగోలు అర్బన్: ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ నివాసంలో సంక్రాంతి సంబరాలు సందడిగా జరిగాయి. కలెక్టర్ దినేష్ కుమార్, ఆయన సతీమణి బాపట్ల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి తొలి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ప్రకాశం, బాపట్ల జిల్లాల ఎస్పీలు మలికాగర్గ్, వకుల్ జిందాల్ దంపతులు ఈ వేడుకలకు హాజరయ్యారు. ఇరువురు ఐఏఎస్ దంపతులు, ఐపీఎస్ దంపతులు వారి పిల్లలు బంధుమిత్రులతో కలిసి కలెక్టర్ నివాసంలో సంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు. పొంగళ్లు పెట్టారు. గంగిరెద్దుల విన్యాసాల నడుమ సంప్రదాయబద్ధంగా పండుగను జరుపుకున్నారు.



వేడుకల్లో ప్రకాశం, బాపట్ల జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు దినేష్ కుమార్, విజయకృష్ణన్, మలికాగర్గ్, వకుల్ జిందాల్



కుటుంబ సభ్యులతో సరదాగా..



గంగిరెద్దుకు ఆహారం తినిపిస్తున్న దినేష్ కుమార్ దంపతులు

ఉత్సాహంగా మహిళా బీచ్ కబడ్డీ పోటీలు



క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న జస్టిస్ మన్మథరావు



శ్రీకాకుళం, వైజాగ్ జట్ల మధ్య హోరాహోరీ..

ఒంగోలు రూరల్: జాతీయ స్థాయి మహిళా బీచ్ కబడ్డీ పోటీలు ఒంగోలు మండలం కరవదిలో ఆదివారం సాయంత్రం ఉత్సాహంగా జరిగాయి. పోటీలను రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ మన్మథరావు ప్రారంభించారు. మాజీ జాతీయ క్రీడాకారుడు పీవీ రంగారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మన్మథరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో జాతీయ స్థాయి మహిళా బీచ్ కబడ్డీ పోటీలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. గ్రామీణ క్రీడ అయిన బీచ్ కబడ్డీ పోటీల్లో భారీ స్థాయిలో ప్రేక్షకులు పాల్గొని ఆదరణ చూపటం సంతోషకరమని చెప్పారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తి చూపాలని, ఓటమి, గెలుపు సమానంగా స్వీకరించాలని పిలుపునిచ్చారు. తొలుత సభా పరిచయాన్ని ఎన్.మోహన్‌దాస్, సర్పంచ్ డి.కోటేశ్వరరావు నిర్వహించారు.

అంతర్జాతీయ క్రీడాకారుడు, డీఎస్పీ వేణు మాట్లాడుతూ కరవదిలో అనేకసార్లు క్రీడా పోటీల్లో పాల్గొని బహుమతులు పొందిన జ్ఞాపకాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా జడ్జిలు భారతి, రామగోపాల్, గాయత్రి, రామశర్మ, ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ ఆర్.గిరిధర్‌తో పాటు ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ భాస్కర్‌రావు పాల్గొన్నారు. తొలుత శ్రీకాకుళం, వైజాగ్ మహిళల మధ్య పోటీ జరగగా, 38–34 స్కోర్‌తో శ్రీకాకుళం జట్టు విజయం సాధించింది. రెండో పోటీ విజయనగరం , గుంటూరు మధ్య జరగగా విజయనగరం జట్టు గెలుపొందింది.

శింగరకొండ క్షేత్ర అభివృద్ధికి చర్యలు

- టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

అద్దంకి: శింగరకొండ క్షేత్ర అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలను టీటీడీ తరఫున అందిస్తానని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ఆయన ఆదివారం సంక్రాంతి పండుగ సందర్భంగా శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు, దేవస్థాన కమిటీ చైర్మన్ కోట శ్రీనివాసకుమార్, ఏసీ సుభద్ర సాదర స్వాగతం పలికారు. దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతోపాటు వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, ఏఎంసీ మాజీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ అర్చకులు పూలమాలతో సత్కరించి, స్వామివారి శేష వస్త్రాన్ని బహుకరించి, తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ క్షేత్రాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.



ఆలయం వద్ద వైవీ సుబ్బారెడ్డి, ఆమంచి కృష్ణమోహన్

క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి మృతి

గిద్దలూరు రూరల్: మండలంలోని దిగువమెట్ట రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని ఓ వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. రెండు మూడు నెలలుగా దిగువమెట్ట రైల్వే స్టేషన్‌లో భిక్షాటన చేస్తూ జీవనం కొనసాగించే ఓ వ్యక్తి మృతి చెందినట్లు స్థానికులు నంద్యాల జీఆర్‌పీఎఫ్ పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు


క్షతగాత్రులను 108 లో ఎక్కిస్తున్న సిబ్బంది

పొదిలి రూరల్: కుక్కలు అడ్డురావడంతో బైక్ అదుపు తప్పి పడిపోయి నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన పొదిలి విశ్వనాథపురం ఒంగోలు–కర్నూలు రహదారిపై సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు దొనకొండ మండలం పుల్లాయిపల్లి గ్రామానికి చెందిన పోలు నాగేశ్వరరావు తన కుటుంబ సభ్యులతో కలిసి ద్విచక్ర వాహనంపై పొదిలి మండలం మాదాలవారి పాలెం గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో పొదిలి విశ్వనాథపురం పెట్రోల్ బంకు దగ్గర ఒక్కసారిగా కుక్క అడ్డు రావడంతో అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో బైక్ పడిపోయింది. దీంతో బైక్ పై ప్రయాణిస్తున్న నాగేశ్వరరావుతో పాటు భార్య ఇద్దరు పిల్లలకు తీవ్ర గాయాలయ్యాయి. నాగేశ్వరరావుకు శరీరానికి బలమైన గాయాలు కాగా, మిగిలిన ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రులను 108 పొదిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స చేశారు.

రెండు బైకులు ఢీకొని ఒకరు మృతి


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఒంగోలు టౌన్: వేగంగా వస్తున్న రెండు బైకులు ఢీకొని ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలైన ఘటన ఆదివారం సాయంత్రం త్రోవగుంట జంక్షన్ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...వేటపాలేనికి చెందిన ఈ.ప్రతాప్ మోటారు బైకు మీద ఒంగోలు వస్తున్నాడు. సరిగ్గా త్రోవగుంట జంక్షన్ వద్దకు రాగానే ఇనుమనమెళ్లూరు గ్రామానికి చెందిన పసుమర్తి రామకోటయ్య (46) బైకు మీద వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఇద్దరికీ తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న తాలూకా ఎస్‌ఐ సురేష్ ప్రమాదం జరిగిన ప్రాంతానికి చేరుకొని క్షతగాత్రులను జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ రామకోటయ్య మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ కాలువలో గుర్తు తెలియని మృతదేహం

దర్శి: సాగర్ కాలువలో గుర్తుతెలియని మృతదేహం ఆదివారం ఓటీసీ వద్దకు వచ్చింది. ఒంటిపై ఎటువంటి దుస్తులు లేవు. శరీరం చీకిపోయి తెల్లగా పాలిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. విషయం తెలుసుకున్న ఎస్సై రామకృష్ణ, సీఐ రామకోటయ్యలు మృతదేశాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతదేహం దూరం నుంచి కొట్టుకొచ్చినట్లు తెలుస్తోందని అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలపారు.

కన్న కొడుకును కడతేర్చిన తండ్రి

- తలపై రాయితో మోది దారుణంగా హత్య


సునీల్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

చీమకుర్తి: చేతికందొచ్చిన కొడుకును కన్నతండ్రే కిరాతకంగా హత్య చేశాడు. మండలంలోని బూసురపల్లి గ్రామంలో సోమవారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుంటూరు జిల్లా ముప్పాళ్ల మండలం పలుదేవర్లపాడు గ్రామానికి చెందిన జొన్నలగడ్డ బాబు, తన భార్య మార్తమ్మ, కుమారుడు సునీల్ (26)తో కలిసి బూసురపల్లి గ్రామంలోని నల్లపాటి వెంకట్రావు అనే రైతు వద్ద పొగాకు పచ్చాకు పనులు చేసేందుకు మేస్త్రీ చినపూర్ణయ్య ఆధ్వర్యంలో నెల రోజుల క్రితం వచ్చారు. ఈనెల 14వ తేదీన జొన్నలగడ్డ బాబు పచ్చాకు పనుల కోసం వచ్చిన తోటి వారిని ఇష్టమొచ్చినట్లు అసభ్యంగా తిడుతూ శాడిస్ట్‌గా ప్రవర్తిస్తున్నాడు. అది చూసి కొడుకు సునీల్ అలా ఎందుకు చేస్తున్నావన్నందుకు మద్యం తాగిన బాబు.. పచ్చాకు పనులు అయిపోయే లోపు నిన్ను చంపేస్తానంటూ కొడుకుపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. గతంలో స్వగ్రామంలో భార్య, కుమారుడిపై కత్తి, గొడ్డలితో దాడి చేసిన సమయంలో వారికి తీవ్ర గాయాలయ్యాయి. అప్పట్లో గ్రామంలోని పెద్దల సమక్షంలో పోలీసు స్టేషన్ వద్దకు పోకుండా బాబు బయటపడ్డాడు. ఆ సంఘటనలను దృష్టిలో ఉంచుకొని రెండు రోజుల క్రితం చంపుతానని బాబు ఇచ్చిన హెచ్చరికలతో తల్లి, కొడుకు భయపడి బాబుకు కనపడకుండా పచ్చాకు పనులు చేసుకుంటూ ఉన్నారు. సోమవారం ఉదయం నల్లపాటి వెంకట్రావు పశువుల కొష్టంలో సునీల్ నిద్ర పోతుండగా తండ్రి బాబు సమీపంలోనే ఉన్న గ్రానైట్‌సైజు రాయిని తీసుకొని అతని తలపై బలంగా కొట్టి హత్య చేసినట్లు సంఘటన స్థలంలో ఉన్న రక్తపు మరకలు అంటిన రాయిని బట్టి పోలీసులు నిర్ధారించుకున్నారు. కొడుకు కనపడలేదని తల్లి మార్తమ్మ వెతుకుతూ కొష్టం వద్దకు వచ్చినప్పుడు రక్తపు మడుగులో ఉన్న కొడుకు సునీల్ మృతదేహాన్ని చూసి బంధువుల ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చింది. విషయం తెలుసుకున్న డీఎస్పీ నాగరాజు, సీఐ రాంబాబు, ఎస్సై ఆంజనేయులు సంఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. తల్లి మార్తమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు. తండ్రి బాబు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

పోలీస్ స్టేషన్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్


అగ్ని ప్రమాదంలో కాలిపోయిన నాటు తుపాకీలు


కాలిపోయిన ఫైళ్లను వేరు పరుస్తున్న కానిస్టేబుల్

- 30 ఏళ్లనాటి ఫైళ్లు, భద్రపరిచిన నాటు తుపాకులు దగ్ధం

సీఎస్‌పురం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు ఏర్పడి పలు ఫైళ్లు దగ్ధమైన సంఘటను సోమవారం వేకువజామున జరిగింది. ఎస్సై గదికి పక్కనే ఉన్న ఓ గదిలో పాత ఫైళ్లను భద్ర పరచారు. పాతకాలం పలువురి నుంచి స్వాధీనం చేసుకున్న నాటు తుపాకులు, గత సంవత్సరంలో పట్టుబడిన ఎర్ర చందనం దుంగలను సైతం ఆ గదిలోనే భద్రపరచారు. అయితే సోమవారం వేకువజామున ఆ గదిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి అగ్ని ప్రమాదం జరిగింది. ఈ కారణంగా ఏర్పడిన మంటల వల్ల గదిలో ఉన్న కొన్ని ఫైళ్లు పూర్తిగా, కొన్ని ఫైళ్లు పాక్షికంగా, అక్కడ ఉన్న నాటు తుపాకులు పాక్షికంగా కాలిపోయాయి. మంటలు ఏర్పడిన సమయంలో పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ ఆవులయ్య రికార్డులు భద్ర పరచిన గదిలో నుంచి పొగలు రావటాన్ని గుర్తించి హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్‌కు, ఎస్సై అనిల్ కుమార్‌కు సమాచారం అందించారు. దీంతో ఎస్సై అనిల్ కుమార్, పోలీసు సిబ్బంది, స్థానికుల సహకారంతో మంటలను అదుపు చేశారు.

దగ్ధమైన ఫైళ్లన్నీ పాత కేసులకు సంబంధించినవే :

పోలీసు స్టేషన్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఏర్పడిన మంటల్లో కాలిపోయిన ఫైళ్లన్నీ పాత కేసులకు సంబంధించినవేనని దర్శి డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైన ఫైళ్లు దాదాపు 30 ఏళ్ల నాటివనీ, మూసేసిన కేసులకు సంబంధించినవని చెప్పారు. 2013లో వేటగాళ్ల నుంచి స్వాధీనం చేసుకున్న తుపాకులు కూడా కాలిపోయినట్లు చెప్పారు. సమావేశంలో పామూరు సీఐ కె శ్రీనివాసరావు, ఎస్సై పీ అనిల్ కుమార్ ఉన్నారు.

మతిస్థిమితం లేని బాలికపై లైంగికదాడి

కొండపి: మండలంలోని ముప్పవరం గ్రామంలో మతి స్థిమితం లేని 14 ఏళ్ల బాలికపై నలుగురు వ్యక్తులు లైంగికదాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొండపి పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రామక్రిష్ణ తెలిపిన సమాచారం మేరకు.. నాలుగు నెలల నుంచి గ్రామంలో 14 సంవత్సరాలున్న మతి స్థిమితం లేని బాలికపై అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు బహిరంగ, నిర్జన ప్రదేశాల్లో పలుసార్లు లైంగికదాడికి పాల్పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న బాలిక తండ్రి రెండు రోజుల క్రితం స్టేషన్‌లో నలుగురు వ్యక్తులపై ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేశామని, కేసును దర్శి డీఎస్పీ దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామక్రిష్ణ తెలిపారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు పంపినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మరో ముగ్గురికి గాయాలు

కొమరోలు: రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందగా ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని హనుమంతరాయునిపల్లె గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. చింతలపల్లె గ్రామానికి చెందిన చిట్టేటి వెంకటస్వామి (37) పని నిమిత్తం కుటుంబ సభ్యులతో కొమరోలుకు వచ్చి తిరిగి స్వగ్రామమైన చింతలపల్లె గ్రామానికి వెళ్తుండగా హనుమంతరాయునిపల్లె గ్రామసమీపంలో ఎదురుగా వస్తున్న టీవీఎస్ ద్విచక్ర వాహనం ఢీకొనడంతో చిట్టేటి వెంకటస్వామి, భార్య చిట్టేటి రంగమ్మ, కుమారుడు చిట్టేటి వెంకటేశ్వర్లు, కుమార్తె అఖిల తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనంలో క్షతగాత్రులను గిద్దలూరు వైద్యశాలకు తరలిస్తుండగా తీవ్రంగా గాయపడిన వెంకటస్వామి పరిస్థితి విషమంగా మారడంతో మార్గమధ్యంలో మృతిచెందాడు. భార్య రంగమ్మకు తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు మార్కాపురం వైద్యశాలకు ప్రైవేటు వాహనంలో తీసుకెళ్లారు. పండుగ పూట వెంకటస్వామి మృతిచెందడంతో చింతలపల్లె గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బస్టాండు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి


దుకాణాల వద్ద ఉన్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కంభం: స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో దుకాణాల వద్ద సోమవారం రాత్రి సుమారు 50 ఏళ్ల వయస్సున్న గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మృతి చెందిన వ్యక్తి వారం రోజులుగా బస్టాండు పరిసరాల్లో తిరుగుతూ మద్యం తాగుతున్నట్లు తెలిపారు. మద్యం మత్తులో మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

జల్సాలకు అలవాటుపడి దొంగతనాలు !

మార్కాపురం: దాదాపు 20 రోజులుగా మార్కాపురంలో దొంగతనాలు చేస్తూ అటు పోలీసులకు, ఇటు ప్రజలకు చుక్కలు చూపిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. సీసీటీవీ పుటేజ్‌లో అనుమానాస్పదంగా సంచరించటంతో పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయటంతో నిందితుడు నేరాలు ఒప్పుకున్నట్లు తెలిసింది. విచారణలో పలు ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. మండలంలోని నికరంపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు పదో తరగతి వరకు మాత్రమే చదివి బెట్టింగుల్లో (ఆన్‌లైన్ పేకాట, క్యాసినో) లక్షల రూపాయలు పోగొట్టుకున్నాడు. అప్పులు తీర్చేందుకు దొంగతనాలను మార్గంగా ఎంచుకున్నాడు. ఇందులో భాగంగా గత నెల 20 నుంచి ఈనెల 8వ తేదీలోపు సుమారు 10 దొంగతనాలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. దొంగతనంలో దొరికిన బంగారాన్ని పలు ప్రైవేటు ఫైనాన్స్‌లలో తాకట్టుపెట్టి డబ్బులు తీసుకున్నట్లు తెలిసింది. తాకట్టు కూడా తెలివిగా కుటుంబ సభ్యుల పేర్లమీద పెట్టినట్లు పోలీసుల ఇంటరాగేషన్‌లో తేలినట్లు సమాచారం. దీంతో నిందితుని కుటుంబ సభ్యులతో పాటు ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులను పోలీసులు స్టేషన్‌కు పిలిపించటంతో వారు లబోదిబోమంటున్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు


ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, తూమాటి నర్సింహారెడ్డి


పందెపు బండను లాగుతున్న శీలం నాగిరెడ్డి ఎడ్లు

- పోటీలను ప్రారంభించిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె
- విజేతగా నిలిచిన శీలం జగన్‌మోహన్‌రెడ్డి ఎడ్లు


ప్రథమ బహుమతి అందజేస్తున్న జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు వాకా వెంకటరెడ్డి, తూమాటి నర్సింహారెడ్డి

గుండ్లసముద్రం (మద్దిపూడి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని గుండ్లసముద్రం గ్రామ సచివాలయ సమీపంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, ప్రైస్ విజన్‌గ్రూప్స్ అధినేత తుమాటి వెంకట నర్సింహారెడ్డి, ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు, మద్దిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. వైఎస్సార్ కడప జిల్లా కాశినాయన మండలం అనువారిపల్లి గ్రామానికి చెందిన శీలం జగన్‌మోహన్‌రెడ్డి ఎడ్లు 3,068.9 అడుగుల దూరం లాగి ప్రథమ విజేతగా నిలిచి రూ.40 వేల నగదును ప్రథమ బహుమతిగా గెలుచుకున్నాయి. అలాగే ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం సుంకేసుల గ్రామానికి చెందిన ముద్దపాటి శ్రీనివాసులు ఎడ్లు 2763.5 అడుగుల దూరం లాగి ద్వితీయ బహుమతిగా రూ.35 వేలు గెలుపొందాయి. బేస్తవారిపేట, జేసీ అగ్రహారం గ్రామానికి చెందిన లక్కు నాగశివశంకర్ ఎడ్లు 2500 అడుగుల దూరం, అలాగే ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం అర్ధవీడు గ్రామానికి చెందిన షేక్ జాఫర్‌సాహెబ్ ఎడ్లు 2500 అడుగుల దూరాన్ని ఇద్దరి ఎడ్లు సమానంగా లాగడంతో 3, 4 బహుమతులైన రూ.27,500 నగదును కైవసం చేసుకున్నాయి. వైఎస్సార్ కడప జిల్లా కాశినాయన మండలం నరసాపురం గ్రామానికి చెందిన కామినేని ప్రతాప్‌రెడ్డి ఎడ్లు 2181.9 అడుగుల దూరం లాగి ఐదో స్థానంలో నిలిచి రూ.20 వేలు గెలుపొందాయి. ప్రకాశంజిల్లా రాచర్ల మండలం జే పుల్లలచెరువు గ్రామానికి చెందిన నక్కా అశోక్ ఎడ్లు 750 అడుగుల దూరం లాగి ఆరో స్థానాన్ని కైవసం చేసుకుని రూ.15 వేలు గెలుపొందాయి. న్యాయ నిర్ణేతగా వాకా సుబ్బారెడ్డి వ్యవహరించారు. కొండపి సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ పీ అంకమ్మరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బీ మురళీకృష్ణ, ఆవుల కృష్ణారెడ్డి, ఆవులు సంజీవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బూచి లక్ష్మీరెడ్డి, వాకా అంజిరెడ్డి, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, మారెడ్డి సుబ్బారెడ్డి, ఇనుకొల్లు మాదిరెడ్డి, ఇనుకొల్లు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు


కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: రోటరీక్లబ్ ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం చీమకుర్తిలో మొదలైన స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీలను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీతత్వాన్ని అలవరచుకునేందుకు, నైపుణ్యాలు మెరుగుపరచుకునేందుకు పోటీలు దోహదం చేస్తాయన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కబడ్డీ పోటీల్లో క్రీడాకారులు ప్రతిభా నైపుణ్యాలను ప్రదర్శించాలని ప్రోత్సహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గొల్లపూడి కోటేశ్వరరావు, మార్తల తిరుపతిరెడ్డి, రోటరీక్లబ్ మాజీ అధ్యక్ష, కార్యదర్శులు చెరుకూరి రఘుకిరణ్, మన్నం నాగరాజు, పోకూరి రామకృష్ణారెడ్డి, పరాంకుశం శ్రీనివాసమూర్తి, ఏ.వీరారెడ్డి, గొల్లపూడి వెంకట్రావు, స్థానికులు పాల్గొన్నారు.


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారిణులు